# అద్దింటి గోల

- పి.బి.సరోజినీదేవి

అబ్బిరాజుకి చిన్నప్పటినుంచీ కథలు రాయడమంటే మహా సరదా. తెల్ల కాయితాలమీద ఏదేదో బరికేసి చూపిస్తే చాలు... తన ఫ్రెండ్సంతా ఆహా...ఓహో... అంటూ మెచ్చుకోవడం పరిపాటే. కానీ తనకి మాత్రం మనసునిండా అసంతృప్తే. ఎందుకంటే తను రచయిత అనిపించుకోవాలంటే తన కథ ఒక్కటయినా పత్రికలో అచ్చుకు నోచుకోవాలి కదా. ఇంతవరకూ పత్రికకి పంపిన ఏ కథా అచ్చుకాలేదు మరి. అది తనని ఎంతగానో బాధిస్తూ వుంది. ఎంత ప్రయత్నించినా అచ్చుకు నోచుకునే కథను మాత్రం రాయలేకపోయాడు. అందుకు కారణాలు ఏవేవో చెప్తుంటాడు. ఒకటి... సహకరించని పరిస్థితులు, రెండోది... ఎప్పుడూ తన చుట్టూ ఈగల్లా, దోమల్లా ఉండే ఫ్రెండ్స్. అందుకనే ఓ నెలరోజులపాటు వీళ్ళందరికీ దూరంగా ఏకాంతంలో కూర్చుని ఎలాగైనా ఓ మంచి కథని రాసి పత్రికకి పంపించాలన్న పట్టుదల పెరిగింది అబ్బిరాజుకి.

వైజాగ్‌లో ఓ నెలరోజులపాటు ఏదో కంపెనీలో ఎప్రెంటీస్ కోసం వెడుతున్నానని అందరికీ చెప్పి పెట్టే బేడాతో బయల్దేరాడు. తనకి వైజాగ్ కొత్త కాదు కాబట్టి ఇల్లు దొరకడం చాలా సులభతరమైంది. అదీ తనకి నచ్చినచోట. అద్దె ఎక్కువయినా అన్ని సదుపాయాలతో అత్యాధునికంగా ఉన్న భవంతి అది. మేడ మీద పోర్షను. రెండు పోర్షన్ల నడుమ హాలు. హాలుకి ఎదురుగా బాల్కనీ. ఇంకా బాగా నచ్చిన విషయం అవతలి పోర్షన్ ఖాళీగా ఉండడం. ఎవ్వరి గోలా ఉండదు. ఎదురుగా కనిపించే సముద్రం, అంచుల్లో పాలనురుగుల్లాంటి కెరటాలు, చుట్టూ కొండలు, రోడ్డమీద నడియాడే మహా జన సంచారం. కనువిందు చేసే ఇంత చక్కటి ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో 'కనుల ముందు నీవుంటే కవిత పొంగి పారదా' అన్నట్టు కథలు రాకుండా ఎలా వుంటాయి? అబ్బిరాజుకి ఎంతో ఆనందంగా వుంది. ఇంటి ఓనర్సు కూడా ఇక్కడ లేరు. ఇంటికి అడ్వాన్సు ఇచ్చేసి రచనలు సాగించడానికి అవసరమైన సరంజామాని బయటకు తీసి మంచిరోజు కోసం ఎదురుచూసాడు. ఒక వారం గడిచింది. తెల్లారితే చాలా మంచి రోజు. ముహూర్తం పెట్టుకుని, ముందురోజు హాయిగా నిద్రపోయాడు.

నిద్ర లేచేసరికి అబ్బిరాజు మూడంతా పాడయిపోయింది. ప్రక్క పోర్షనులోకి ఎవరో దిగారు. సందడే సందడి. సామాన్ల గడబిడ. లౌడు స్పీకర్లలా పెద్ద వాళ్ళ కబుర్లు. ఇద్దరు ముగ్గురు కోతుల్లాంటి పిల్లలు అప్పటికే ఆటలు మొదలుపెట్టారు. పరుగులు పెట్టడాలు, తలుపులు బాదడాలు. అబ్బిరాజుకి ఇంటి ఓనరు మీద చచ్చేంత కోపం వచ్చింది. తల పట్టుకుని కూర్చున్నాడు. వాళ్ళ గోల తప్పితే బుర్రలో ఇంకేమీ లేదు. పేపరు మీద ఒక్క లైను కూడా పడలేదు. అలా మరోవారం గడిచిపోయింది.

ఒకరోజు తెల్లారి చూసేసరికి ప్రక్క పోర్షను వాళ్ళు లేరు. ఖాళీ చేసి వెళ్ళిపోయారు. మళ్ళీ అబ్బిరాజులో కొత్త ఉత్సాహం పుట్టుకొచ్చింది. హఠాత్తుగా ఇంటి ఓనరు 'టు లెట్' బోర్డు పట్టుకుని దాన్ని బయట తగిలిస్తూ వచ్చేవాళ్ళకి పోర్షన్ చూపించమని తాళాలు చేతికిచ్చి వెళ్లాడు. ఆలోచనలో పడ్డాడు అబ్బిరాజు. తను కథ రాయడం పూర్తయ్యేవరకూ ఆ పోర్షన్‌లోకి ఎవర్నీ దిగనీకుండా చేస్తే బాగుంటుందని ఓ ప్లాను వేసాడు.

మర్నాడు ఎవరో ఇల్లు చూడడానికి వచ్చారు. తాళాలిచ్చి ఓ మాట చెప్పాలన్నాడు అబ్బిరాజు.

'ఏమిటని' అతను అడిగేసరికి-

'ఈ పోర్షన్‌లో ఏదో వాస్తులోపం వుందని, అద్దెకొచ్చినవాళ్ళకే అది వర్తిస్తుందని, దానికి వాళ్ళే ఓ రకం శాంతి కూడా చేయించుకోవాలని, ఇలా ఇంటి ఓనరు చెప్పమన్నాడని' అన్నాడు.

అదేంటో చెప్పమన్నాడతను.

"ఆ పోర్షన్‌లోకి అడుగుపెట్టిన ఆ కుటుంబ యజమాని ఎర్రగా కాల్చిన ఇనుప చువ్వతో వాత వేయించుకోవాలి. అంతే" అన్నాడు.



ఆ వచ్చినతను కంగారు పడిపోతూ "ఇదెక్కడి చోద్యమండీ? ఎక్కడా చూడలేదూ, వినలేదు" అంటూ నెమ్మదిగా జారుకున్నాడు. అలా వచ్చిన నలుగురైదుగుర్ని పంపించివేసాడు అబ్బిరాజు.

మరో వారం గడిచిపోయింది. కథ రాయలేకపోయాడు. ఇక వారం మాత్రమే మిగిలి వుంది. ఎలాగైనా కథ రాసెయ్యాలి.

ఓ రోజు ఇంటి ఓనరు వచ్చి "బాబూ! నువ్వేమీ అనుకోకపోతే అర్జంటుగా నువ్వీ పోర్షన్‌లోకి షిఫ్ట్ కావాలి" అని అన్నాడు. చాలా ఇదిగా రిక్వెస్టు చేసాడు. ప్రక్క పోర్షన్‌కన్నమాట. కాదనలేకపోయాడు అబ్బిరాజు. మరుసటిరోజు అబ్బిరాజు లేచి బయటికి వచ్చేసరికి పక్క పోర్షన్‌లో ఒకతను ఫోజుగా అబ్బిరాజువైపే చూస్తూ-

"ఏం గురూ! ఆ పోర్షన్‌లో వాస్తు లోపం వుందని, అది అద్దెకొచ్చినవాళ్ళే భరించాలని అన్నావుకదా. అందుకని అదేమీ ఇంటి ఓనరు ముందు ఎత్తకుండా మీరుండే పోర్షన్ కావాలని, ఖాళీ చేయించి ఇవ్వమని అడిగాను. ఎలా ఉంది?" అని కళ్ళెగరేసాడు.

భంగపడ్డట్లయింది అబ్బిరాజుకి.

మొత్తానికి కథ రాయలేకపోయాడు అబ్బిరాజు. సామాన్లన్నీ సర్దేసుకుని వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నాడు. ఇంటికి అద్దె డబ్బులు, నెలంతా జీవనానికి ఖర్చులు దండగ. ఇంక కథలు రాయలేనని నిర్ణయించుకున్నాడు.

మనసంతా బాధగా ఉండి, ఆలోచిస్తూ పడుకున్నాడు. మధ్య రాత్రిలో ఓ ఐడియా! లేచి లైటు వేసి కాగితం, పెన్ను తీసుకున్నాడు. పైన 'అద్దింటి గోల' అని హెడ్డింగ్ పెట్టి విశాఖలో తను అడుగుపెట్టినప్పట్నుంచీ ఈ రోజువరకూ జరిగిన ఈ గోలంతా రాసి దాన్ని మళ్ళీ ఫెయిర్ కాపీ చేసి కవర్లోకి తోసేసి దానిమీద ఒక వారపత్రిక అడ్రస్ రాసి ప్రొద్దుటే పోస్టు చేసాడు. ఇప్పుడు మనసుకి ఓ మూల ఏదో కొంచెం తృప్తిగా అన్పించింది అబ్బిరాజుకి.

కథ తప్పకుండా అచ్చవుతుందన్న ఆశతో హుషారుగా ఇంటికి బయల్దేరాడు అబ్బిరాజు.

★